## ప్రభుత్వ కళాశాలలో జాబ్‌మేళా

కామారెడ్డి టౌన్, జూన్ 14: కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం హెచ్‌సీఎల్ టెక్ బీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించినట్లు ఇంటర్ నోడల్ అధికారి షేక్‌సలాం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాబ్‌మేళా ద్వారా సాఫ్ట్‌వేర్ రంగంలో శిక్షణ పొందుతూ ఉన్నత విద్యను కూడా అభ్యసించవచ్చని తెలిపారు. 70 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని వివరించారు. ఎంపిక కాబడిన వారికి డీపీవో రోల్‌లో ఒక సంవత్సరం శిక్షణ ఇచ్చి ఉద్యోగంలోకి తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఎల్ టెక్ బీ ఏరియా ప్రతినిధి రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నాగలితో దుక్కి దున్నుతున్న రైతు





విత్తనాలను విత్తుతున్న రైతులు

# సాగు సందడి

కామారెడ్డి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులు పడుతున్నాయి. తొలకరి జల్లులు కురుస్తుండడంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తు న్నాయి. జిల్లాలో చిరుజల్లులు పడడంతో రైతులు వానా కాలం పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. పొలాలను సాగు కోసం సిద్ధం చేసే పనిలో పడ్డారు. పశువుల ఎరువులను పొలాలకు తరలిస్తున్నారు. దుక్కులు దున్ని సిద్ధం చేసుకుంటున్నారు. తొలకరి జల్లులు పలుకరిం చడంతో విత్తనాలు విత్తుకునేందుకు అన్ని పనులు పూర్తి చేసుకుంటున్నారు. జిల్లాలో వ్యవసాయ పనులు మొదల య్యాయి. చిరుజల్లులు పడుతుండడంతో ఆరుతడి పంట లు సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఇప్పటికే సోయా, మొక్కజొన్న, పత్తి, పప్పుదినుసు పంటల విత్తనా లను విత్తుతూ సాగులో నిమగ్నమయ్యారు. అయితే పంటల సాగు పెట్టుబడి కోసం రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు. ప్రభుత్వం పెట్టుబడి సాయం డబ్బులను ఖాతాలో జమ చేయకపోవడం మరోవైపు బ్యాంకుల్లో రుణాలు దక్కకపోవడం, ఇటీవల అమ్మిన ధాన్యం డబ్బులు కూడా సకాలంలో రాకపోవడంతో పంట ల సాగు కోసం రైతులు అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

### 5.14 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం

జిల్లా వ్యవసాయశాఖ సైతం వానాకాలం పంటల సాగు ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ వానాకాలంలో 5.14 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అంచనా వేశారు. వరి 3,13,965 ఎకరాల్లో సాగవుతుంద ని అంచనా వేయగా, మొక్కజొన్న 57,315 ఎకరాలు, పత్తి 28,730, సోయాబిన్ 85,444, కందులు 13,961, పెసర్లు 4,997, మినుములు 5,263, చెరుకు 2,215, జొన్నలు 577 ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా వేశా రు. ఈ వానాకాలం సీజన్‌లో సాగయ్యే పంటలకు అనుగుణంగా విత్తనాలను సైతం అందుబాటులో జిల్లా వ్యవసాయశాఖ సిద్ధమైంది. 78,492 క్వింటాళ్లలో వరి, 25,633 క్వింటాళ్లలో సోయాబిన్, 287 పత్తి క్వింటాళల్లో, మొక్కజొన్న 4,667, కందులు 419, పెసర 400, మిను ములు 421 క్వింటాళ్లలో విత్తనాలు అవసరం కానున్నా యి. అయితే ఈ విత్తనాలకు ప్రభుత్వం ఎలాంటి సబ్సి డీని ఇవ్వడం లేదు. దీంతో ప్రైవేట్ డీలర్ల వద్ద ఈ విత్త నాలను అందుబాటులో ఉంచుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం తరుపున సొసైటీల ద్వారా జనుము, జీలుగ విత్తనాలను రైతులకు సబ్సిడీపై సరఫరా చేశారు. ఇప్పటి వరకు సబ్సిడీపై 10,700 క్వింటాళ్లలో, జనుము, జీలుగ విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. అయితే జిల్లాలో ఎక్కువగా వరి తర్వాత సోయాబిన్, పత్తి, మొక్క జొన్న పంటలను సాగు చేస్తుంటారు.

- జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న చిరు జల్లులు
- సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- ఆరుతడి పంటల సాగులో నిమగ్నమైన రైతులు
- వరి నారుమళ్లు, దుక్కులు సిద్ధం చేస్తున్న అన్నదాతలు
- విత్తనాలు, ఎరువుల కొనుగోలు
- వానాకాలంలో 5.14 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం

### 96వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం

జిల్లా వ్యాప్తంగా రైతులకు 96 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కానున్నాయని వ్యవసాయశాఖ అధి కారులు అంచనా వేశారు. వీటిలో 50,908 మెట్రిక్ టన్ను లలో యూరియా, 33,250 మెట్రిక్ టన్నులలో కాంప్లెక్స్, 13,143 మెట్రిక్ టన్నులలో డీఏపీ, 8,696 మెట్రిక్ టన్ను లలో ఎంవోపీ ఎరువులు అవసరమవుతాయని అధికా రులు అంచనా వేశారు. ఇందులో ఇప్పటికే యూరియా 10,120 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని, కాంప్లె క్స్ 4,969 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1,767 మెట్రిక్ టన్ను లలో, ఎస్‌వోపీ 260 మెట్రిక్ టన్నుల స్టాక్ అందుబా టులో ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతు న్నారు. అయితే ప్రతీ వానాకాలం సీజన్‌లో పంటల సాగు ఎక్కువగా ఉండడంతో యూరియా వాడకం పెరు గుతోంది. డిమాండ్‌కు తగ్గట్టుగా యూరియా నిల్వలు లేక పోవడంతో ఈ ఎరువుల కొరత ఎదురవుతోంది.

### ఆరుతడి పంటల సాగులో నిమగ్నమైన రైతులు

గతేడాది సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగానే నమోదైంది. నైరుతి సీజన్‌లో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షం కురిసింది. అయితే జిల్లాలో కురుస్తున్న చిరు జల్లులకు ఆరుతడి పంటలైన సోయా, మొక్కజొన్న, పత్తి, పప్పుదినుసు పంటలు సాగులో రైతులు నిమగ్నమయ్యారు. గత వారం రోజుల నుంచి జిల్లాలో ఆకాశం మేఘావృతం అవుతుండడం, పలు మండలాలు, గ్రామాల్లో చిరుజల్లులు పడుతుండడంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లాను మాత్రం తొలకరి జల్లులు పలుకరించినా వర్షం అంతంత మాత్రంగానే ఉన్నాయి. మరికొన్ని రోజుల్లో వచ్చే సంవత్సరం లాగానే అత్యధిక వర్షాలే ఉంటాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతుండడంతో రైతులు భారీ వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు.

### రుణమాఫీపై రైతుల్లో ఆశలు

పంట రుణాలపై రైతుల్లో సందిగ్ధత నెలకొంది. వాస్తవంగా రైతులు పంట రుణాలు తీసుకుని, వాటిని ఏడాది లోపు రెన్యూవల్ చేసుకుంటారు. ప్రభుత్వం పంట రుణాల మాఫీపై చర్యలు చేపడుతోంది. అయితే ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఒకేసారి మాఫీ చేసి తిరిగి రుణాలు ఇస్తే ఉపయోగకరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. కొందరు రైతులు ఏడాది లోపు రుణాలను రీ షెడ్యూల్ చేసుకునే పనిలో ఉంటే, మిగతా రైతులు వేచి చూసే ధోరణి అవలంబిస్తున్నారు.

# ప్రైవేట్‌లో పుస్తకాల దందా!

- ఒక్కో పాఠశాలకు ఒక్కో పబ్లికేషన్
- రూపాయి కూడా తగ్గించని నిర్వాహకులు
- కొన్ని పాఠశాలల్లో మొదటి విడత ఫీజు కడితేనే పుస్తకాలు అందిస్తామని పేచీ
- పుస్తకాలకే రూ.6 వేల నుంచి రూ.10వేల వడ్డింపు



జిల్లా కేంద్రంలోని ఆయా ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు అమ్మకాలు జరుపుతున్న దృశ్యం

కామారెడ్డి టౌన్, జూన్ 14: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని హౌజింగ్‌బోర్డు వైపు ఉన్న ఓ పాఠశాలలో ఓ విద్యార్థి ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్నాడు. గత విద్యా సంవత్సరం అదే పాఠశాలలో 3వ తరగతి పూర్తి చేసుకున్న సదరు విద్యార్థి ఇటీవల వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో 4వ తరగతి చదివేందుకు పాఠశాలకు వస్తున్నాడు. అయితే ఈ తరగతి చదివేందుకు కావాల్సిన పుస్తకాలను తమ పాఠశాలల్లోనే కొనాలని సదరు పాఠశాల నిర్వాహకులు తల్లిదండ్రులకు హుకూం జారీ చేశారు. సరేలే బయట కొనేకంటే పాఠశాలల్లోనే కొంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు కదా అని ఆలోచించి ఎంత అవుతుంది అని అనడంతో రూ.8వేల వరకు పుస్తకాలకు ఖర్చు అవుతుందని, పైగా మొదటి విడత ఫీజు కడితేనే పుస్తకాలు అమ్ముతామని పేచీ పెట్టడంతో సదరు విద్యార్థి తండ్రి ఇదేక్కడి ప్రైవేట్ దోపిడిరా నాయనా అంటూ విస్తుపోయి చేసేదేమి లేక రూ.30వేల వరకు అప్పు తీసుకువచ్చి మరీ మొదటి విడత ఫీజుతో పాటు పుస్తకాలను కొనుగోలు చేశాడు. ఇది కేవలం ఒక తండ్రికి ఎదురైన సంఘటన కాదు.. ఒక పాఠశాలలో జరుగుతున్న బాగోతం కాదు.. ఎందరో తల్లిదండ్రులు తమ బిడ్డ భవిష్యత్తు కోసం ప్రైవేట్ పాఠశాలల బాగోతాలను ప్రశ్నించలేక అప్పులు చేసి మరీ పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. విద్యానగర్ కాలనీలోని మరో పాఠశాలలో పుస్తకాలు కొనా లంటే మొదటి విడత ఫీజు కట్టాలని కేవలం ఓ తెల్లకాగితంపై పేయిడ్ అని రాసి ఇచ్చి మరో చోట పుస్తకాలను అందిస్తున్నారు. జన్మభూమి రోడ్డు దగ్గర, సిరిసిల్లా రోడ్డు సమీపంలో గల మరో కార్పొరేట్ పాఠశాల ఏకంగా సిరిసిల్లా రోడ్డులోని ఎల్లమ్మగుడి దగ్గర దుకాణం తెరిచి అమ్మకాలు జరపడంతో ఇదేంటని అడిగితే వారికి మాకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొంటున్నారు. మరీ మీ పాఠశాలకు చెందిన వివరాలు ఆ పుస్తకాల మీద ఎలా ఉన్నాయని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తే మాకు సంబంధం లేదంటూ దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారు. ఇలా అనేక పాఠశాలల్లో పుస్తకాలు అమ్ముతున్నారని విద్యార్థి సంఘాలు గగ్గోలు పెట్టి విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఎలాంటి చర్యలు మాత్రం ఉండడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కేవలం సంజాయిషీ అడిగి గమ్మునుంటున్నారే తప్ప ఆ పాఠశాలలను పరిశీలించిన దాఖలాలు లేవని విద్యార్థి సంఘాలు పేర్కొంటున్నాయి.

### అనుమతులు లేకుండా విక్రయాలు

జిల్లాలో ప్రైవేట్ పుస్తకాల దందా ఇష్టారీతిన కొనసాగుతోంది. పుస్తకాలను అమ్మవద్దని ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. అయినా తమను ఎవరు అడ్డుకునేదని ఇష్టారీతిన పుస్తకాల విక్రయాలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ అనుమతులు, ధ్రువీకరణ పత్రాలు లేకుండానే పుస్తకాలు విక్రయిస్తుండటం గమనార్హం. పుస్తకాలు, నోట్‌బుక్‌లు, డైరీ, వివిధ కంపెనీల పబ్లికేషన్‌లు తమ పాఠశాల పేరుతో ముద్రించి వాటిని విద్యార్థులకు విక్రయిస్తున్నారు. అంతేకాక పాఠశాలల్లో ఇచ్చే పుస్తకాలను, నోట్‌బుక్‌లను మాత్రమే తీసుకోవాలని హుకూం జారీ చేస్తున్నారు. ఒక పుస్తకాలే కాదు స్కూల్ యూనిఫాం సైతం అక్కడే అమ్మకాలు జరుపుతున్నారు. పుస్తకాలపై ఎంఆర్‌పీ ధరలో 60శాతం మాత్రమే తీసుకోవాల్సి ఉండగా ఎంఆర్‌పీ ధరలకే అమ్మకాలు జరుపుతున్నారు. దీంతో కేవలం పుసక్తాలకే రూ.6 వేల నుంచి రూ.10 వేలు ఖర్చు అవుతుందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

### కుప్పలు తెప్పలుగా పుస్తకాలను గుర్తిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల్లో కుప్పలు తెప్పలుగా పుస్తకాలు బహిరంగంగానే అమ్మకాలు జరుపుతున్నారు. అలాంటి పాఠశాలల దోపిడీపై ఒకవేళ ఫిర్యాదు చేస్తే ఎక్కడ మా పిల్లలకు ఇబ్బందులు కల్గిస్తారోనని తల్లిదండ్రులు విద్యార్థి సంఘ నాయకుల దృష్టికి తీసుకెళ్తున్నారు. దీంతో వారు పాఠశాలలను పరిశీలిస్తే గుట్టలుగా పుస్తకాలు దొరుకుతున్నాయి. వాటిని విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకుపోతే చర్యలు తీసుకుంటామని చెబుతున్నా చర్యలకు మాత్రం దిగడం లేదని విద్యార్థి సంఘ నాయకులు పేర్కొంటున్నారు. ధనార్జనే ధ్యేయంగా ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు ఇష్టారీతిన పుస్తకాలు, నోట్‌బుక్‌ల విక్రయాలు చేస్తున్నాయని ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు మేల్కొని చర్యలకు పూనుకోవాలని అప్పుడే ఈ దందాకు చెక్‌పెట్టవచ్చునే వాదనలు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకుల నుంచి వినిపిస్తోంది.

### పుస్తకాల విక్రయాలపై ఫిర్యాదు చేసినా చర్యలు కరువు

**• చరణ్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్**

జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు అమ్ముతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు తమ దృష్టికి తీసుకువస్తే పాఠశాలలను పరిశీలించాం. లిటిల్ స్కాలర్స్, వాగ్దేవి, కాకతీయ, గౌతమ్ మోడల్ తదితర పాఠశాలల్లో పుస్తకాలు విక్రయిస్తుండడంతో వాటిని గుర్తించి విద్యాశాఖాధికారులకు ఫిర్యాదులు సైతం చేసి ఆధారాలను అందించాం. అయినా ఎక్కడా కూడా కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో ఇప్పటికీ రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు తీసుకుంటూ పుస్తకాలను అమ్ముతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖాధికారులు పట్టింపు లేని తనం ప్రదర్శించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థిక దోపిడీకి గురవుతున్నారు.

### పుస్తకాలకు రూ.వేలల్లోనే వసూళ్లు

**• అరుణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు**

ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు అమ్మవద్దని నిబంధనలు ఉన్నా సదరు నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. పుస్తకాలతో పాటు దుస్తులు అమ్మకాలు జరుపుతున్నారు. ఫీజు చెల్లిస్తేనే పుస్తకాలు, దుస్తులు అమ్మకాలు జరుపుతామని మెలిక పెడుతున్నారు. కేవలం నర్సరీకి రూ.18 వేల వరకు ఫీజులు వసూలు చేయడంతో అదనంగా ఈ పుస్తకాల దందాకు రూ.8వేల వరకు, దుస్తులకు మరో రూ.5వేల వరకు వసూలు చేస్తూ విద్యా వ్యాపారం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన పుస్తకాలను సిరిసిల్లా రోడ్డులో ఎల్లమ్మగుడి సమీపంలో అమ్మకాలు జరుపుతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే అది మాకు సంబంధం లేదని చెబుతున్న యాజమాన్యం మీ పాఠశాల పుస్తకాలే ఎందుకు అమ్మకాలు జరుపుతున్నారని ప్రశ్నిస్తే దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారు. పాఠశాలలో పుస్తక, దుస్తుల దందా విచ్చలవిడిగా సాగుతున్న విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదు.

# ధరణి దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలి

**సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిత్తల్**




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు

కామారెడ్డి టౌన్, జూన్ 14: పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మరో సారి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్, ఆర్డీవో. తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తులను పరిష్కరించేందుకు కృషి చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిత్తల్ తెలిపారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తుల రికార్డులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, డేటా కరెక్షన్ దరఖాస్తులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టిన తర్వాత పరిష్కరించాలని తెలిపారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులను రివ్యూ చేసుకోవాలని, అధికంగా పెండింగ్ ఉన్న మండలాలకు అవసరమైన అదనపు సిబ్బందిని కేటాయించాలని తెలిపారు. ధరణి వెబ్‌సైట్ సంబంధించి జీఎల్ఎం టీఎం 33 దరఖాస్తులలో డిజిటల్ సంతకాల ప్రక్రియ మార్పులు చేస్తున్నామని, కొన్ని సమస్యలు తహసీల్దార్ స్థాయిలో, మరికొన్ని సమస్యలు ఆర్డీవో, మరికొన్ని కలెక్టర్ స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతీ మండలంలో సబ్ రిజిష్టర్ కార్యాలయం ఏర్పాటుకు అనువైన భవనం లేదా భూమి కేటాయించి ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళిక బద్ధంగా పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ సూచనల ప్రకారం వీలైనంత త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఆర్డీవోలు రంగనాథరావు, ప్రభాకర్, రమేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్ట్‌పై సమీక్ష

కామారెడ్డి టౌన్, జూన్ 14: ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్ట్ 20, 21, 22 ప్యాకేజీ పనులపై శుక్రవారం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ హైదరాబాద్‌లోని తన నివాసంలో ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్, ఈఈ మల్లేష్, పోచమ్మల బృందంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా రైతులకు రెండు లక్షల 75వేల ఎకరాలకు సాగు నీరు అందించే ఉద్దేశ్యంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రారంభించిన పనులను వేగవంతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. త్వరలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో ఉన్న మీటింగ్‌లో నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు.



ప్రాజెక్ట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ

# పేకాట స్థావరంపై దాడి

రెంజల్,జూన్14: మండలంలోని కందకుర్తి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు శుక్రవారం రెంజల్ ఎస్ఐ సాయన్న ఆధ్వర్యంలో దాడి చేశారు. పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి 23,620రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. పేకాట ఆడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 'మహేష్‌కుమార్‌కు పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలి'

నందిపేట, జూన్14: మండలంలోని చౌడమ్మ కొండూర్ గ్రామంలో ఉన్న చాముండేశ్వరీ ఆలయంలో శుక్రవారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పూజలు చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు తెలంగాణ పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరుతూ ఆలయంలో అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. పీసీఈ అధ్యక్ష పదవిలో వచ్చి ఆయన చౌడేశ్వరీ ఆలయంలో మొక్కులు తీర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ డెలిగేట్ సామల దేవిదాస్ గౌడ్, మండల కార్యదర్శి బి రాజేశ్వర్, గ్రామశాఖ అధ్యక్షులు మేతరి గంగ సాయిలు, నాయకులు జి జీవన్, రవి, సంజీవ్, వెంకట రమణ తదితరులు ఉన్నారు.

# ధర్పల్లిలో ఆరోగ్యమేళాకు విశేష స్పందన

దర్పల్లి, జూన్ 14: మండల కేంద్రంలోగల ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరానికి శుక్రవారం విశేషస్పందన లభించింది. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్ వైద్యులు రోగులకు చికిత్సను అందజేశారు. ఈ సందర్భంగా 146 మందికి పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి సుశాంత్‌రెడ్డి, ఈఎన్‌టీ వైద్యులు శిల్ప, ఆర్థోపెడిక్ సర్జన్ పరీక్షిత్, సిబ్బంది పాల్గొన్నారు.

# కోటగిరిలో ఆరోగ్య శిబిరం

కోటగిరి,జూన్14: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఆరోగ్య మహిళ కార్యక్రమం నిర్వహించారు. వైద్యురాలు శ్రీలత ఆధ్వర్యంలో ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. 25మంది మహిళలు, 32 మంది పురుషులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం హెగ్డోలి గ్రామంలో కాలం చెల్లిన మందులు తీసుకున్న మహిళ ఆరోగ్య స్థితిగతులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు అర్చన, సుప్రియ, హెల్త్‌సూపర్‌వైజర్ గోవర్ధన్, జ్యోతి, సుభాషిణి, విజయ తదితరులు పాల్గొన్నారు.

# ఏకరూప దుస్తుల పంపిణీ

వర్ని,జూన్14: వర్ని మండల కేంద్రంలో శుక్రవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. మహిళా సంఘాల సభ్యులతో కుట్టించిన ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీఎం రాజయ్య, ఏపీఎం ప్రసాద్, సీసీలు పూల్‌సింగ్, తుకారాం, రమేష్ పాల్గొన్నారు.

## నేడు నందిపేట, మాక్లూర్ మండలాల్లో
# విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిపేట, జూన్14: నందిపేట, మక్లూర్ మండలాల పరిధిలో ఉన్న 33/11 కేవీ సబ్ స్టేషన్‌ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నందిపేట డివిజన్ ట్రాన్స్‌కో ఏడీ ఎం అశోక్ తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3గంటల నుంచి మధ్యాహ్నా 7గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ చెప్పారు. దీనికి నందిపేట, మాక్లూర్ మండలాల పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారులు సహకరించాలని నందిపేట ట్రాన్స్‌కో ఏడీఈ ఎం అశోక్ కోరారు.

## మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ

డిచ్‌పల్లి, జూన్ 14 :కిరాణ దుకాణంలో ఉన్న మహిళ మెడలో నుంచి ఇద్దరు దుండగులు శుక్రవారం పుస్తెల తాడును ఎత్తుకె ళ్లినట్లు డిచ్‌పల్లి ఎస్‌ఐ తెలిపారు. మొగుళ్ల వినోద అనే మహిళ ధర్మారం (బీ) గ్రామంలో తన కిరాణ దుకాణంలో ఉండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు రూ.50 ఇచ్చి సిగరేట్ కావాలని అడిగారు. ఆమె మిగిలిన చిల్లర ఇస్తుండగా మెడలో ఉన్న 3 తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పారిపోయారని డిచ్‌పల్లి ఎస్.ఐ వివరించారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## సారంగపూర్ ఆలయ హుండీ లెక్కింపు

నిజామాబాద్ అర్బన్, జూన్ 14:నగర శివారులోని సారంగపూర్ హనుమాన్ ఆలయ హుండీని శుక్రవారం దేవాదాయ శాఖ సహాయ కమీషనర్ సుప్రియ, ఏవో వేణు తదితరుల ఆధ్వర్యంలో లెక్కించారు. మొత్తం 61,290 రూపాయల ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. నోట్ల రూపంలో 59,120 రూపాయలు, నాణెల రూపంలో 2,170 రూపాయలు హుండీ ద్వారా వచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శశికుమార్, ప్రశాంత్, నాగరాజు భక్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఇందల్వాయి, జూన్ 14:ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు. ఇందల్వాయి మండలంలోని చంద్రయాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు సకాలంలో అందజేసి విద్యాభ్యాసం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ అధ్యాపకులచే నాణ్యమైన విద్య అందింపబడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వం ఉచితంగా అందించే పాఠ్యపుస్తకాలు, దుస్తులు సద్వినియోగం చేసుకోవాలని ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలిత గంగాదాస్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీధర్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య విద్యార్థులకు బంగారు పతకాలు

పెద్దబజార్, జూన్ 14 :పదవతరగతి, ఇంటర్, ఎంసెట్.నీట్, పీజీ, ఐటీఐ, జేఈఈ మేయిన్స్ అడ్వాన్స్‌లలో అత్యంత ప్రతిభ కనబర్చినఆర్యవైశ్య విద్యార్థిని, విద్యార్థులకు ఈనెల 30న బంగారు పతకాలు అందజేస్తున్నట్లు ఆర్యవైశ్య అఫిషియల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జగదీష్ తెలిపారు. ఈనెల 30లోపల దరకాస్తులు చేసుకోవాలని, విద్యార్థిని, విద్యార్థులు జిల్లా కేంద్రానికి చెందిన వారై ఉండాలన్నారు. వచ్చే సమయంలో తమతో 2పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్‌కార్డు, అన్ని జిరాక్స్ కాపీలు తీసుకుని రావాలన్నారు. వివరాలకు సెల్.9290095825సంప్రదించాలని కోరారు.

## నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, జూన్ 14: నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగర ఏడీఈలు చంద్రశేఖర్, తోటరాజశేఖర్, వీరేశంలు తెలిపారు. నగరంలోని పవర్‌హౌజ్, తిలక్‌గార్డెన్, దుబ్బ, మిర్చికంపౌండ్, వినాయక్‌నగర్, బోర్గాం, న్యూకలెక్టరేట్ కార్యాలయం, ముబారక్‌నగర్, సుభాష్‌నగర్, అర్సపల్లి, మిర్చికంపౌండ్, హౌజింగ్‌బోర్డు, గూపన్‌పల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని అన్నారు. ఉదయం 8 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని

## 'వసూళ్లకు పాల్పడుతున్న వారిని తరిమికొట్టండి'

నిజామాబాద్ అర్బన్, జూన్ 14:నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలో ప్రైవేటు విద్యాసంస్థలు, వ్యాపారులు, ప్రభుత్వ హాస్టల్ వార్డెన్ల దగ్గర పీడీఎస్‌యు పేరుతో బ్లాక్‌మెయిల్ చేస్తూ అక్రమ ఆర్థిక వసూళ్లకు పాల్పడుతున్న బీర్కూర్ మండలానికి చెందిన బాల్‌రాజ్‌ను తరిమికొట్టాలని పీడీఎస్‌యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గౌతం కుమార్, జన్నారపు రాజేశ్వర్‌లు తెలిపారు. గత కొద్దికాలంగా పీడీఎస్‌యుకు ఎలాంటి సంబంధం లేకుండా పీడీఎస్‌యు పేరుతో వసూళ్లకు పాల్పడుతూ ఫోన్‌లు చేస్తూ బ్లాక్‌మెయిల్ చేస్తున్న బాల్‌రాజ్ అనే వ్యక్తికి పీడీఎస్‌యుకు ఎలాంటి సంబంధం లేదని ఇలాంటి తప్పుడు మాటలు నమ్మి ఎవరూ మోసపోవద్దన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

మోర్తాడ్, జూన్14: మోర్తాడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, వీడీసీ చైర్మన్ జక్కం అశోక్‌లు పంపిణీ చేశారు. పాఠశాలలో ఎలాంటి సదుపాయాలు కావాలన్నా తమ దృష్టికి తీసుకురావాలని వీడీసీ అధ్యక్షుడు జక్కం అశోక్ అన్నారు. ఉపాధ్యాయులు సరోజదేవి, శైలజ, రాజేందర్, అశోక్, పుప్పాల రాజ్‌విఠల్, పడపటి అంజేశ్వర్, హరీష్‌గౌడ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

ముప్కాల్, జూన్14:ముప్కాల్ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పి.శ్రీనివాస్ అనారోగ్యంతో గత కొంత కాలం బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ శుక్ర వారం చికిత్స నిమిత్తం రూ.2లక్షల 60వేల ఎల్‌వోసీని శ్రీనివాస్ కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎల్‌వోసీని అందజేసిన సునీల్‌కుమార్‌కు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## మిషన్ భగీరథ ఇంటింటి సర్వే

ముప్కాల్, జూన్14: ముప్కాల్ మండల కేంద్రంలో మిషన్ భగీరథ ఇంటింటి సర్వేను శుక్రవారం డీఎల్‌పీవో శివరామకృష్ణ తనిఖీ చేశారు. జిల్లా మిషన్ భగీరథ నీటి సరఫరాపై సర్వే చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో భరత్ చంద్ర, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పశువులకు గొంతువాపు వ్యాధి నిరోధక టీకాలు

మాక్లూర్, జూన్ 14:మండలంలోని మదన్‌పల్లి క్యాంప్ మదన్‌పల్లి గ్రామాల్లో పశు వైద్య ఆధ్వర్యంలో శుక్రవారం పశువులకు గొంతువాపు, జబ్బవాపు టీకాలను వేసినట్లు పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్‌దేశ్ పాండే తెలిపారు. పశువులకు గొంత వాపు టీకాలను వేయించేలా చూడాలని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్య క్రమంలో డాక్టర్ ఉమమసాహెర్, సిబ్బంది వినత, గంగాజమున, షైమద్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

మాక్లూర్ , జూన్ 14:మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్నాపూర్, మామిడిపల్లి గ్రామాల్లోని పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పాఠ్యపుస్తకాలతో పాటు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో జరిగే పనులను ఆయన పర్యవేక్షించారు. ఆయన వెంట ఎంపీడీవో క్రాంతి, ఎంపీవో శ్రీనివాస్, ఎంపీటీసీ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు, ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

## రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

మాక్లూర్ , జూన్ 14: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 15రోజులు గడుస్తున్నా పంటల ప్రణాళికను ప్రకటించలేదని, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే రైతాంగ సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాల కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారని, సర్కారు విఫలమైందని, రైతు బంధు, రుణమాఫీ వాగ్దానాలు ఇంత వరకు అమలు పర్చలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేస్తూ తహసీల్దార్‌కు ఇచ్చిన వినతిపత్రంలో తెలిపారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ ప్రధానకార్యదర్శి దేశెట్టి సాయి రెడ్డి, నాయకులు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం.. ప్రాణదానం

## ధర్మారంలో శిబిరం ప్రారంభించిన డీఎంహెచ్‌వో



ధర్మారంలో రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో తుకారం రాథోడ్

డిచ్‌పల్లి,జూన్ 14: రక్తదానం ద్వార ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం ఎంతో దోహదం చేస్తుందని యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ధర్మారం(బి) సూర్య ఆరోగ్యసంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం డీఎంహెచ్‌వో ప్రారంభించారు. 42యూనిట్ల రక్తాన్ని గ్రామ యువకులు స్వచ్ఛందంగా ఇచ్చారు. రాథోడ్ మాట్లాడుతూ.. యువత రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని అత్యవసర పరిస్థితులు ఉన్న రోగులకు, గర్భిణీ స్త్రీలకు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారి ప్రాణాలు కాపాడేందుకు ఎంతో దోహదం చేస్తుందన్నారు. చెడు కోలేస్ట్రాల్, గుండె జబ్బులు, అధిక బరువుల నియంత్రణకు దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సూర్య ఆరోగ్య సంస్థ చైర్మన్ ఉదయ సూర్యభగవన్, సంస్థ ప్రతినిధులు రామకృష్ణ, నాగేశ్వరరావు, రాజేందర్ కుమార్, విక్రమ్, ప్రశాంత్, వినోద్, సుధాకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వాసుబాబు, బర్ధిపూర్ విండో చైర్మన్ రామకృష్ణ, గ్రామ యువకులు పాల్గొన్నారు. రక్తదానంలో పాల్గొన్న యువకులను డీఎంహెచ్‌వో, ప్రజాప్రతినిధులు అభినందించారు.

# మిషన్ భగీరథపై ఇంటింటి సర్వే



మద్నూర్‌లో మిషన్ భగీరథపై సర్వే చేస్తున్న సిబ్బంది

మద్నూర్, జూన్ 14 : మిషన్ భగీరథపై రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ పథకం ప్రారంభమై అయిదేళ్ళయిన క్షేత్రస్థాయిలో సమస్యలు వెంటాడుతున్నాయి. పథకం ద్వారా ఇంటింటికి తాగునీరు అంతంత మాత్రంగానే సరఫరా అవుతుంది. కొన్ని గ్రామాల్లో నల్లాలు కూడా అమర్చలేదు. పైప్‌లైన్ల లీకేజీల మరమ్మతుల ఖర్చులను గ్రామ పంచాయితిదే. తాగునీటి సరఫరా లేని, అవాసాలు ప్రాంతాలు నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటి సర్వేను ప్రారంభించింది.

### ● సర్వే ఇలా సాగనుంది

జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో 10 రోజుల పాటు గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. సర్వేలో మిషన్ భగీరథ అధికారులకు భాగస్వామ్యం కల్పించలేదు. వారిని పక్కన పెట్టి ఎంపీడీవోలు, ఎంపీవోలు, గ్రామ కార్యదర్శులు, ఉపాధి ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఐకేపీ సిబ్బంది బాధ్యతలు అప్పగించి, శిక్షణ ఇచ్చి సర్వేకు పంపించారు. వారు ప్రతిరోజు 25 నుంచి 30 ఇండ్లను సర్వే చేసి వివరాలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. సర్వేలో మిషన్ భగీరథ నల్ల కనెక్షన్ ఉందా..? నీళ్ళు వస్తున్నాయా...? ఎన్ని రోజులకు ఒకసారి వస్తున్నాయి. వంద లీటర్లు వస్తున్నాయా... వచ్చే నీళ్ళు మిషన్ భగీరథ నీళ్ళ స్థానిక బోరు బావుల నీళ్ళ తదితర వివరాలు తెలుసుకుంటున్నారు. అలాగే యజమాని పేరు ఆధార్ సెల్ నెంబర్లతో కలిపి యాప్‌లోనమోదు చేస్తున్నారు. యజమాని ఫోటో ఇంటితో పాటు నల్ల ఫోటోను కూడా తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. ఆ తరువాత యజమాని సెల్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేస్తే ధ్రువీకరణ పూర్తవుతుంది.

### ● అన్నిరైట్ అన్నట్లుగా నమోదు

ఇంటింటా సర్వేకు వెళ్లిన సర్వే అధికారులకు ప్రజల నుంచి మిశ్రమ స్పందన లభిస్తుంది. నీళ్ళు రావడం లేదని కొందరు వచ్చిన కొద్దిగానే వస్తున్నాయని మరికొందరు చెబుతున్నారు. ఇంకొందరు మిషన్ భగీరథ కనెక్షన్ ఉన్న స్థానికంగా ఉన్న బోర్లు, బావుల ద్వారానే నీరు సరఫరా అవుతుంది అని అంటున్నారు. కాని సర్వే అధికారులు వాటిని పట్టించుకోకుండా నల్ల ఉంది. నీళ్ళు వస్తున్నాయి అని అన్ని రైట్ అన్నట్లుగా నమోదు చేస్తున్నారు.

## బోర్గాం(పి) జడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించిన డీఈవో



పాల్గొన్న డీఈవో

మోపాల్, జూన్ 14: బోర్గాం(పి) జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ శుక్రవారం ఉదయం సందర్శించారు. పాఠశాలకు ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. విద్యార్థులు చెప్పిన పాఠాలను క్రమశిక్షణతో విని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు డీఈవో సూచించారు. ప్రార్థన సమయానికి డీఈవో పాఠశాలను సందర్శించడంతో పాఠశాల ఉపాధ్యాయులు అలర్ట్ అయ్యారు.

## కరెంట్ షాక్‌కు గురైన నెమలికి చికిత్స

నందిపేట, జూన్14: మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో శుక్రవారం నెమలికి మండల పశు వైద్యాధికారి డాక్టర్ హన్మంత్ రెడ్డి చికిత్స చేశారు. ఉదయం మండలంలోని చింరాజ్‌పల్లి గ్రామ శివారులో లక్కంపల్లి ఎంపీటీసీ సభ్యులు సిరిగిరి శ్రీనివాస్ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి నెమలికి కరెంట్ షాక్ తగిలింది. దీంతో నెమలి కాలుకు తీవ్ర గాయమైంది. స్థానికుల సమాచారం మేరకు అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి సుధాకర్ నెమలి స్థానిక వెటర్నరి ఆస్పత్రికి తీసుకువచ్చారు. గాయమైన కాలుకు మండల పశు వైద్యాధికారి డాక్టర్ హన్మంత్ రెడ్డి చికిత్స చేశారు. నెమలి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉండడంతో దానిని మాక్లూర్ మండలం చిన్నాపూర్ గ్రామ శివారులో ఉన్న అర్బన్ పార్క్‌లో వదిలినట్లు డిప్యూటీ రేంజ్ అధికారి సుధాకర్ తెలిపారు.

## స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక

ఆర్మూర్‌రూరల్, జూన్14: మండలంలోని మగ్గిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి జాతీయస్థాయిలో ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎనిమిది మంది విద్యార్థినిలు ఎంపికైనట్లు పాఠ శాల హెచ్ఎం హరిత తెలిపారు. 9, 10తరగతులతో పాటు ఇంటర్మీడియట్ వరకు నాలుగేళ్ళ పాటు సంవత్సరానికి రూ.12వేల చొప్పున విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందుతుందన్నారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థినిలను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

# క్షయవ్యాధి పట్ల అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న జిల్లా క్షయవ్యాధి నివారణ ప్రాజెక్టు అధికారి సంతోష్

డిచ్‌పల్లి,జూన్ 14: క్షయ వ్యాధితో బాధపడుతున్న రోగులు అప్రమత్తంగా ఉండాలని వారికి ఆశ కార్యకర్తలు ఆరోగ్య కార్యకర్తలు కావల్సిన సన్నిహిత సంబంధాలు, ఉంచుకోవాలని క్రమం తప్పకుండా బీసీసీ వ్యాక్సిన్ రోగులకు ఇవ్వడంజరుగుతుందని జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి సంతోశ్ కుమార్ అన్నారు. శుక్రవారం సీహెచ్‌లో ఆరోగ్య , ఆశా కార్యకర్తలు, ఎమ్ఎల్‌హెచ్‌పీ కార్యకర్తల సమావేశానికి సంతోశ్ కుమర్ హాజరై మాట్లాడుతూ.. 60ఏళ్లు నిండిన క్షయ వ్యాధి గ్రస్తులకు బీసీసీ వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుందని, 18ఏళ్లు పైబడి పొగత్రాగడం అలవాటు ఉన్న వారు, టీబీ వ్యాధిగ్రస్తులతో సన్నిహిత సంబంధాలు ఉన్న వారి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్ మాట్లాడుతూ.. ఆరోగ్య కార్యకర్తలందరు సర్వే వివరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అందజేయాలని బీసీసీ టీకా కోసం ఎన్ని సెషన్స్ కావోలో తెలియజేయలన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ కోఆర్డినేటర్ రవి కుమార్, పర్యవేక్షకురాలు స్రవంతి, ఆరోగ్య కార్యకర్తలు, పర్యవేక్షణ అధికారి అక్బర్ అలీ, పాల్గొన్నారు.

## టీయూ వీసీ నియామకం మరింత ఆలస్యం !

డిచ్‌పల్లి,జూన్ 14:తెలంగాణ విశ్వవిద్యాలయానికి శాశ్వత వైస్ చాన్స్‌లర్ నియామకం మరింత ఆలస్యం కానున్నట్లు తెలుస్తుంది. మే 21 నాటికి తెలంగా వర్సిటీ వీసీ పదవి కాలం ముగిసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఎన్నికల నియామవళి ఉండటంతో శాశ్వత వీసీ నియామకం సాధ్యపడాలేదు. దీంతో ఇంచార్జ్ వీసీగా ఐఏఎస్ అధికారి సందీప్ సుల్తానియను ప్రభుత్వం నియమించింది. నూతన వీసీలను నియామించే ఈ నెల 15వ తేది వరకు నియామకం చేస్తామని ప్రభుత్వం హామీఇచ్చిన హామీ అమలు పర్చకపోవడంతో ఇంచార్జ్ వీసీగా సందీస్ సుల్తానియను మరింత కాలం పొడిగించే అవకాశం ఉందని వర్సిటీ ప్రొఫెసర్‌లు కొందరు పేర్కొం టున్నారు. ఉప కులపతి నియామకం కోసం ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేసి నెల రోజులు అవుతున్న ఇంత వరకు కమిటీ సమావేశం జరగకపోవడం వీసీ నియామకానికి ఆలస్యం అయ్యే పరిస్థితి నెలకొంది. ఎన్నికల కోడు ముగిసినందున కమిటీ సమావేశాలు నిర్వహించుకొని తెలంగాణ వర్సిటీ కి శాశ్వత వీసీని నియమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వర్సిటీ అధ్యాపకులు కోరుతున్నారు. పాలక మండలిని నూతనం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## కేర్ డిగ్రీ కళాశాల కోర్సులకు ఏఐసీటీఈ అనుమతి



మాట్లాడుతున్న కేర్ కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్

నిజామాబాద్ అర్బన్, జూన్ 14:జిల్లా కేంద్రంలోని కేర్ డిగ్రీ కళాశాలలో నూతన కోర్సులకు ఏఐసీటీఈ అనుమతి ఇచ్చిందని కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ తెలిపారు. గత 19 సంవత్సరాల నుంచి నాణ్యమైన విద్యను అందిస్తున్న కేర్ డిగ్రీ కళాశాలకు బీబీఏ, బీసీఏ కోర్సులకు అను మతి ఇవ్వడం సంతోషకరమన్నారు. విద్యార్థులు ఇప్పుడు నిజామాబాద్ నగరంలో ఉండి బీబీఏ, బీసీఏ, డేటాసైన్స్, ఫుడ్‌టెక్నాలజీ లాంటి అత్యుత్తమైన కోర్సులను చేయవచ్చని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాకు చెందిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ బాలకృష్ణ సందేశ్, కొయ్యాడ శంకర్, సందీప్, విజయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 'కరెంట్ కోతలు లేకుండా చూడాలి'

రెంజల్,జూన్14: గ్రామాలలో ఎటువంటి కరెంట్ కోతలు లేకుండా చూడాలని ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు నీలా సబ్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా కరెంట్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని ఏఈ రాజలింగంను ఆదేశించారు. వర్షాకాలంలో కరెంట్ సమస్యలు అధికంగా ఉండకుండా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసి కరెంట్ కోత లేకుండా చూడాలని, స్తంభాల వద్ద ఎటువంటి ముళ్ల కంపలు, చెట్ల కొమ్మలు వైర్లకు తగలకుండా చూసుకోవాలని అన్నారు. ఆపరేటర్లు అందుబాటులో ఉండి కరెంట్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట ట్రాన్స్‌కో ఏడీఈ బెనర్జీ, ఏఈ రాజలింగం లున్నారు.

# విద్యార్థినికి విద్యాశాఖాధికారి అభినందన



మహతిని అభినందిస్తున్న డీఈవో

నిజామాబాద్ అర్బన్, జూన్ 14: నగరంలోని న్యాల్‌కల్ రోడ్‌లోగల ఆర్కిడ్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని మహతి సెంట్రల్ స్కాలర్‌షిప్ ఇన్ ఫైన్ ఆర్ట్స్ కూచిపూడి అండర్ జూనియర్ ఫెలోషిప్ స్కీమ్ సాధించినందుకు ఆమెను జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ శుక్రవారం తన చాంబర్‌లో అభినందించారు. రాష్ట్రం నుంచి జాతీయ స్థాయిలో వేలాది మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనగా నగరానికి చెందిన మహతి మొదటి స్థానం సంపాదించినట్లు పాఠశాల కరస్పాండెంట్ అనుముల క్రాంతి తెలిపారు. ఈ సందర్భంగా మహతి భవిష్యత్తులో ఉన్నత స్థానంలో ఉండాలని డీఈవో అన్నారు.

## కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

పెద్దబజార్, ,జూన్ 14 :మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీసవేతనాలు అమలు చేయాలని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దండివెంకట్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని శివాజీనగర్‌లో గల లేబర్ కార్యాలయంలో కమీషనర్ యోహాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్పోరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వాటర్‌సప్లయి, గార్డెన్స్ స్ట్రీట్‌లైట్స్, పారిశుధ్య ఔట్‌సోర్సింగ్ జవాన్లకు 2021నుంచి 30శాతం పీఆర్‌సీ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఖమ్మం, వరంగల్, రామగుండం, మొదలు మున్సిపాల్టీ కార్పోరేషన్లలో కనీస వేతనం రూ.19500 అమలు చేస్తున్నాయని అన్నారు. దశలవారిగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని లేడి యెడల సమ్మే నోటీసు ఇస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎల్‌టి నాయకులు యాదయ్య, శ్రీశైలం, అశోక్‌గౌడ్, సతీష్, మురళీ, హరీష్‌లు పాల్గొన్నారు.

# ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

డిచ్‌పల్లి,జూన్ 14: మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకణాలను మండల వ్యవసాయ అధికారి రాంబాబు తనిఖీలు చేశారు. విత్తన దుకాణ దారులు, వ్యాపారులు రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనల వివరాలు, రైతు ఫోన్ నంబరు, రైతు పేరు, గ్రామము వివరాలను ఖచ్చితంగా రిజిస్ట్రార్ నమోదు చే యాలని ఆయన సూచించారు. ఈ పాస్ మిషన్ ద్వారనే అమ్మకాలు జరపాలని రైతులు కూడా కొనుగోళ్ల సమయంలో ఆధార్ కార్డు తప్పని సరిగా వెంట తీసుకురావలని సూచించారు. ఈ సందర్భంగా మండల కేంద్రములోని మన గ్రోమోర్ ను ఏవో తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే విత్తనాలు రైతులు కొనుగోళ్లు చేయాలని సూచించారు.

## పారిశుధ్య పనులను పరిశీలించిన మేయర్

సుభాష్‌నగర్, జూన్ 14:నగరంలో జరుగుతున్న పారిశుధ్య పనులను నగర మేయర్ దండునీతూకిరణ్ పరిశీలించారు. నగరంలోని 22వ డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్‌లో శుక్రవారం పర్యటించారు. పారిశుధ్య పనులను పర్యవేక్షించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. విధిగా మురుగు కాల్వలను శుభ్రం చేయాలని ఇంటింటికి తిరుగుతూ చెత్త సేకరించాలని సూచించారు. వినాయక్‌నగర్‌లోగల అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించి ప్రజలకు అందిస్తున్న సేవలపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని కోరారు. జోన్-2 కార్యాలయంలో కార్మికుల హాజరుపట్టికను తనిఖీ చేసి విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా సేవలు అందించాలని కోరారు.

## పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

ఆర్మూర్‌టౌన్ , జూన్14: పట్టణంలోని ఒడ్డెరకాలనీలో ప్రభుత్వ పాఠశాలలో స్థానిక కౌన్సిలర్ ఖాందేష్ సంగీత శుక్రవారం విద్యార్థులను ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందజేస్తున్న పాఠ్యపుస్తకాలను, దుస్తులను ఆమె అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యుడు తుమ్మల లక్ష్మణ్, ఉపాధ్యాయులు బాగ్యలక్ష్మీ, సునీత, సంధ్య, రాజేంద్రప్రసాద్, అనిత, సత్యం పాల్గొన్నారు.

## పనులు పూర్తి చేయాలని చైర్‌పర్సన్‌కు వినతి

ఆర్మూర్‌టౌన్, జూన్14: పట్టణంలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో పనులు పూర్తి చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్ దేవి లావణ్యకు వినతిపత్రం అందజేశారు. బస్సులు ఒకే రూట్లో రాకపోకలు జరగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇటీవల బస్టాండ్‌లో ఓ మహిళకు ఆర్టీసీ బస్సు ఢీకొని రెండు కాళ్లకు తీవ్రంగా గాయపడిందని అన్నారు. కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు చెల్లించి పనులను పూర్తిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య, నాయకులు భూమేశ్వర్, రవి, కుల్ దీప్‌శర్మ, జయమ్మ పాల్గొన్నారు.



గుట్కాను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

## గుట్కా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

కామారెడ్డి టౌన్, జూన్ 14: నిషేధిత మత్తు పదార్థాలైన పొగాకు, గుట్కాను విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈనెల 13న కామారెడ్డి పట్టణంలోని శాంతి టాకీస్ రోడ్డులో ఉన్న కిరాణ దుకాణంలో కొమిరిశెట్టి ప్రసాద్, సంతోష్‌లు పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుపయ్య ఆధ్వర్యంలో దాడులు చేయగా 519 ప్యాకెట్లు రూ.1లక్ష 14వేల 216 విలువ గల గుట్కా, పొగాకును గుర్తించినట్లు తెలిపారు. అమ్మకాలు జరుపుతున్న ప్రసాద్, సంతోష్‌లపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.



ఈద్గాను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

## ఈద్గాను సందర్శించిన చైర్‌పర్సన్

కామారెడ్డి టౌన్, జూన్ 14: కామారెడ్డి పట్టణంలోని కోర్టు రోడ్డులో గల ఈద్గాను శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, కౌన్సిలర్లు, ముస్లిం పెద్దలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఈద్గా వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించామని తెలిపారు. ఈద్గా వద్ద పూర్తిస్థాయిలో నీటి సౌకర్యం, టెంట్‌లను అందుబాటులో ఉంచాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం కమిటీ మెంబర్స్ మజీద్, సదర్ ఫారుఖ్, కౌన్సిలర్‌లు చాట్ల రాజేశ్వర్, పాత శివకృష్ణమూర్తి, అన్వర్ షేమద్, వంశీ, పంపరి శ్రీనివాస్, షేర్ తదితరులు పాల్గొన్నారు.



బీర్కూర్‌లో తైబజార్ వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

## రూ.2.82 లక్షలకు తైబజార్ వేలం

బీర్కూర్, జూన్ 14: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ భవనంలో శుక్రవారం ఎంపీపీ రఘు సమక్షంలో తైబజార్ వేలం పాటను నిర్వహించారు. ఈ వేలం పాటలో గ్రామస్థులతో పాటు దూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి పాల్గొన్నారు. బీర్కూర్‌కు చెందిన బోగడ మీది గంగారాం అనే వ్యక్తి 2.82 లక్షలకు పాట పాడి తైబజార్‌ను దక్కించుకున్నారు.

## ధ్రువ పత్రాలు లేని వాహనాల పట్టివేత

బీర్కూర్, జూన్ 14 : మండల కేంద్రంలో మంజీరా నదికి వెళ్లే రహదారిలో శుక్రవారం కామారెడ్డి ఆర్‌టీవో అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా వాహనాల ఫిట్‌నెస్, ధ్రువ పత్రాలను పరిశీలించారు. ఫిట్‌నెస్, సరైన పత్రాలు లేని నాలుగు వాహనాలను పట్టుకున్నారు. రెండు బొలేరో వాహనాలు, ఒక వ్యాన్, ఒక స్కూల్ బస్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



ఆర్‌టీవో అధికారులు పట్టుకున్న వాహనాలు



# శాంతియుతంగా పండుగలను జరుపుకోవాలి: సీఐ



బీర్కూర్ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న రూరల్ సీఐ

బీర్కూర్, జూన్ 14: బక్రీద్ పండుగను శాంతియుంగా నిబంధనలకు అనుగుణంగా జరుపుకోవాలని బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణ గౌడ్ ప్రజలను కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మైనారిటీలు బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని గోవులను అక్రమంగా రవాణా చేయవద్దని, గోవులను వధించొద్దన్నారు. ఎవరైనా గోవులను అక్రమంగా రవాణా చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఒకవేళ ఎవరైనా అక్రమంగా గోవులను రవాణా చేస్తే వారిపై దాడులు చేయవద్దని, పోలీసులకు సమాచారం ఇస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్, పోలీసు సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**మద్నూర్:** రాబోయే పండుగలను ఆయా వర్గాల వారు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై శ్రీకాంత్ సూచించారు. శుక్రవారం మద్నూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. రాబోయే బక్రీద్ సందర్భంగా గోహత్య జరపరాదని ప్రభుత్వం దీనిపై ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. హిందూ, ముస్లింలు తమతమ పండుగలను శాంతియుతంగా జరుపుకోవడానికి ఒకరికొకరు సహకరించుకోవాలని అన్నారు. పశువైద్యులు వినీత్ మాట్లాడుతూ.. గోవులను హత్య చేసే అధికారం ఎవరికీ లేదని, అదినేరంగా పరిగణించబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**లింగంపేట:** పండుగలను మతాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బక్రీద్ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో హిందూ ముస్లిం, క్రిష్టియన్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పండుగలను సంతోషంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎలాంటి అల్లర్లకు తావు ఇవ్వ వద్దని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు ఫారూఖ్, ఇబ్రహీం, షాదుల్లా, బీజేపీ నాయకులు దత్తురాంలు, మురళి, క్రాంతి, బొల్లారం సాయిలు పాల్గొన్నారు.

**తాడ్వాయి:** ప్రజలు శాంతియుతంగా జీవనం సాగించాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. తాడ్వాయిమండల కేంద్రంలో శుక్రవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. సమాజంలో శాంతియుతంగా మెలిగి ఎలాంటి గొడవలు పడకుండా ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు. గ్రామాల్లోకి ఎవరైనా కొత్తవారు వచ్చినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



ఎస్సైకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

## గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవాలి

బీర్కూర్, జూన్ 14: బక్రీద్ పండుగ సందర్భంగా గోవుల అక్రమ రవాణా జరుగుతుందని, దీనిని అడ్డుకునేందుకు పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని శుక్రవారం బీజేపీ నాయకులు బీర్కూర్ ఎస్సై రాజశేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ సందర్భంగా గోవులను వధించకుండా అక్రమ రవాణా జరగకుండా పోలీసులు పరిసర ప్రాంతాల సరిహద్దుల్లో ప్రత్యేకంగా చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ బీజేపీ మండల అధ్యక్షులు నాగేళ్ళ సాయి కిరణ్, మండల ప్రధాన కార్యదర్శి యోగేష్, బీజేపీ నాయకులు రవి, బస్వరాజు, బీరుగొండ సత్యనారాయణ, మోహన్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

లింగంపేట. జూన్ 14: లింగంపేట మండల కేంద్రానికి చెందిన కాశి నగేష్(20) తనకు ఎవరూ లేరని జీవితంపై విరక్తి చెంది మత్తడి పోచమ్మకు వెళ్లే దారిలో ఎల్లమ్మ గుడి వద్ద గల చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చైతన్యకుమార్ తెలిపారు. నగేష్ కుటుంబ సభ్యులు అమ్మ, నాన్న, చెల్లెలు తన చిన్నప్పుడే మృతి చెందడంతో కొంతకాలం పెద్దనాన్న వద్ద ఉన్న నగేష్ ఇంట్లో నుంచి వెళ్లిపోయి తరిగి ఇటీవలే వచ్చాడని తెలిపారు. కూలీ పనికి వెళ్లి వస్తూ మాతోనే ఉంటున్నాడని, వచ్చినప్పటి నుంచి తనకు ఎవరూ లేరు నేను ఎందుకు బతుకాలి అంటూ.. మానసికంగా వేదనకు గురయ్యేవాడని మృతుడి పెద్దనాన్న చంద్రయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు. నగేష్‌కు ఎంత ధైర్యం చెప్పినా మనస్థాపం చెంది శుక్రవారం ఉరివేసుకుని మృతి చెందినట్లు ఫిర్యాదు చేసినట్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

భిక్కనూరు, జూన్ 14: భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన ఒక యువకుడు యికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నారిగల్ల ప్రవీణ్‌కుమార్(19) చదువు మానేసి ఇంటివద్దనే ఉంటున్నాడు. కాగా ఈ నెల 4న తన వ్యవసాయ భూమి వద్ద గుర్తుతెలియని క్రిమి సంహారక మందును తాగాడు. వెంటనే గమనించిన కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడా చికిత్స పొందుతూ ప్రవీణ్ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి సిద్ధరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయ్యడం జరుగుతుందని ఎస్సై వివరించారు.

## జంగంపల్లి శివారులో ఒకరి మృతి

భిక్కనూరు, జూన్ 14: భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో ఒకరు వడదెబ్బతో మృతిచెందినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం రాజంపేట మండల కేంద్రానికి చెందిన పాముల రాజేందర్(45) తన తండ్రి బాల్‌కిషన్‌కి ఆరోగ్యం బాగాలేనందున కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స నిమిత్తం బాల్‌కిషన్‌కు ఈ నెల 11న రక్తం ఇచ్చిన రాజేందర్ బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఆసుపత్రి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో రాజంపేట పోలీసుస్టేషన్‌లో ఆయన భార్య గోదావరి ఫిర్యాదు చేసింది. కాగా జంగంపల్లి శివారులోని కోళ్లఫాం సమీపంలో రాజేందర్ మృతిచెంది ఉండగా, వడదెబ్బతో రాజేందర్ మృతిచెందాడని మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు.

## సంతలో అవగాహన కార్యక్రమం

పిట్లం, జూన్ 14: మండల కేంద్రంలోని సంతో శుక్రవారం బక్రీద్ పండగ సందర్భంగా పోలీసులు, వెటర్నరీ వైద్యాధికారి సంతోష్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. ఈనెల 17న బక్రీద్ పండగ సందర్భంగా ఆవులను, తెల్ల కొల్యాగలను గాని మార్కెట్‌లో కొనుగోలు చేయవద్దని తెలిపారు. ఒకవేళ ఎవరైనా అమ్మినా.. కొనుగోలు చేసినా.. వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ లింబాద్రి, వెటర్నరీ వైద్యాధికారి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



పెద్దమల్లారెడ్డిలో అక్షరాభాస్యం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

## పెద్దమల్లారెడ్డిలో సామూహిక అక్షరాభ్యాసం

భిక్కనూరు, జూన్ 14: మండలంలోని పెద్దమల్లారెడ్డి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమంలో బాగంగా చిన్నారులకు సామూహిక అక్షరాభాస్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సర్వతి దేవి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం గోపికృష్ణ మాట్లాడుతూ.. బడిబాట కార్యక్రమంలో బాగంగా పాఠశాలలో చిన్నారులకు సామూహిక అక్షరాభాస్యం కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ ఈశ్వర్, రాజేందర్, ఉపాధ్యాయురాలు సంగీత కుమారీ, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కామారెడ్డిటౌన్, జూన్ 14: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఎంపీపీఅనసూయ ప్రభుత్వం పంపిణీ చేసిన ఉచిత పుస్తకాలను, నోట్ బుక్‌లను విద్యార్థులకు అందించారు. విద్యార్థులు కష్టపడి ఉన్నత ర్యాంకులు సాధించాలని తెలిపారు. జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్‌కు 11 మంది విద్యార్థులు రామ్‌చరణ్, సంజన, ఆకుల సంజన, శ్రీమాన్, సాత్విక, కీర్తన, అభిరాం, కీర్తి, స్మితశ్రీ, నవీన్, సంజన్‌లు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. వీరిని ఎంపీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బానుమతి, ఎంపీటీసీ బీరయ్య, విండో చైర్మన్ కమలాకర్‌రావు, ఏఎంసీ చైర్మన్ రాజేందర్, భూమేష్ పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ సర్వే సిబ్బందికి సహకరించండి

● ఎంపీడీవో సవిత

మద్నూర్, జూన్ 14: మండలంలో మిషన్ భగీరథపై ఇంటింటి సర్వే కొనసాగుతుందని, మీ ఇంటికి వచ్చిన సిబ్బందికి సహకరించాలని మద్నూర్ ఎంపీడీవో సవిత కోరారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో 14975 ఇండ్లు ఉన్నాయని, సర్వే బృందం సభ్యులు ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తున్నారని వారికి సహకరించి వివరాలు అందజేయాలని సూచించారు. ఈ సర్వేలో మిషన్ భగీరథ అధికారులకు సిబ్బందికి భాగస్వామ్యం కల్పించలేదని, వారిని పక్కన పెట్టి ఎంపీడీవో, ఎంపీపీ, గ్రామ కార్యదర్శి, ఉపాధి ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఐకేపీ సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారని, రోజు 25 నుంచి 30 ఇండ్లను సర్వే చేయనున్నట్లు తెలిపారు. మీ ఇంటికి వచ్చిన సిబ్బందికి నల్లా కనెక్షన్ ఉందా, నీళ్ళు వస్తున్నాయా, ఎన్ని రోజులకు ఒకసారి వస్తున్నాయి. వంద లీటర్లు ఒకసారి వస్తున్నాయా, స్థానిక ఉన్న బోరు బావు నీళ్ళు తదితర వివరాలు అడుగుతారని వారికి వివరాలు చెప్పాలని సూచించారు.

## ఘనంగా భగలాముఖి అమ్మవారి జన్మదిన వేడుకలు



భగలాముఖి అమ్మవారు

ఎల్లారెడ్డి, జూన్ 14: పట్టణంలోని బీడీ వర్కర్స్ కాలనీలో ఆర్టీసీ బస్ డిపో పక్కన శుక్రవారం భగలాముఖి అమ్మవారి జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అష్టమిని పురస్కరించుకుని పీఠం నిర్వాహకుడు, జ్యోతిష్య పండితులు క్రాంతి పటేల్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి వివిధ పండ్ల రసాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ కేంద్రానికి చెందిన భక్తులతో పాటు వివిధ మండలాల జిల్లాల రాష్ట్రాలకు చెందిన భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



లింగంపేటలో ఎన్‌డీసీసీ బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

## లింగంపేటలో బ్యాంకు ఎదుట రైతుల ధర్నా

● బ్యాంక్ అధికారుల తీరుపై ఆగ్రహం.. పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

● రైతు తీసుకున్న దీర్ఘకాలిక రుణానికి రుణమాఫీ వర్తించదన్న అధికారులు

లింగంపేట, జూన్ 14: లింగంపేట మండల కేంద్రంలోని ఎన్‌డీసీసీబీ అధికారుల తీరుకు నిరసనగా శుక్రవారం బ్యాంక్ ఎదుట రైతులు ధర్నా చేశారు. పొల్కంపేటకు చెందిన రైతు బండారు రాజశేఖరరెడ్డి 2010లో బ్యాంకులో తన వ్యవసాయ భూమి 4ఎకరాలను మార్టిగేజ్ చేసి రూ. 5లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ డబ్బుల్లో ఇప్పటికీ రూ.2లక్షల 70వేలు చెల్లించాడు. గత గురువారం బ్యాంక్ మేనేజర్ కుమారస్వామి రైతు అప్పుగా తీసుకున్న రుణం వడ్డీతో కలిపి రూ.7లక్షల 86వేలను పూర్తిస్థాయిలో చెల్లించాలని నోటీసులు పంపడంతో.. రైతు రూ.70వేలు చెల్లించాడు. శుక్రవారం మరో రూ.30వేలు చెల్లిస్తానని చెప్పినప్పటికీ.. బ్యాంక్ అధికారులు రైతు వ్యవసాయ భూమిలో వేలం వేస్తామంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి, ఎర్ర జెండాలు పాతారు. విషయం తెలుసుకున్న రైతులు, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్‌లు బ్యాంక్ అధికారులు రైతును అవమాన పర్చారంటూ శుక్రవారం బ్యాంక్ ఎదుట ధర్నా చేసి.. బ్యాంక్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సురేందర్ మాట్లాడుతూ.. రైతులు బ్యాంకులకు అప్పు ఉన్నంత మాత్రాన భూములను వేలం వేస్తామని ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తారా? అని ప్రశ్నించారు. రేపటిలోగా రైతు పొలంలో నుంచి ఫ్లెక్సీలను తొలగించకపోతే ఊరుకోబోమని హెచ్చరించారు. రైతులకు రుణమాఫీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కాగా.. రైతు రాజశేఖర్‌రెడ్డి రుణం తీసుకుని చాలా కాలంగా చెల్లించకపోవడంతో బ్యాంక్ ఏజీఎం ఆదేశాల మేరకు రైతు పొలంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసినట్టు బ్యాంక్ మేనేజర్ కుమారస్వామి తెలిపారు.

● మార్టిగేజ్ చేసి.. రూ. 5లక్షల దీర్ఘకాలిక రుణం తీసుకున్న రైతు

పొల్కంపేట గ్రామ రైతు బండారు రాజశేఖర్‌రెడ్డి.. తనకున్న నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిని 2010వ సంవత్సరంలో లింగంపేటలోని ఎన్‌డీసీసీ బ్యాంక్‌లో మార్టిగేజ్ చేసి రూ. 5లక్షల దీర్ఘకాలిక రుణం తీసుకున్నాడు. కానీ ఇప్పటివరకు రూ.2.70లక్షలు మాత్రమే చెల్లించాడు. ఇటీవల రుణాల రికవరీపై బ్యాంకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అయితే రాజశేఖర్‌రెడ్డి తీసుకున్నది దీర్ఘకాలిక రుణం కావడంతో.. ఇతనికి రుణమాఫీ వర్తించదని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ఇదే క్రమంలో రుణం చెల్లించాలంటూ గతంలో పలుమార్లు సదరు రైతుకు అధికారులు నోటీసులు ఇచ్చారు. అయినప్పటికీ రాజశేఖర్‌రెడ్డి స్పందించలేదు. పైగా అప్పటికే తనకున్న భూమిలో కొంత భాగాన్ని రాజశేఖర్‌రెడ్డి ఇతరులకు విక్రయించినట్టు గ్రామానికి చెందిన కొందరు రైతుల ద్వారా బ్యాంకు అధికారులు తెలుసుకున్నారు. దీంతో ఇచ్చిన రుణాన్ని ఎలాగైనా తిరిగి రాబట్టుకోవాలనుకునే క్రమంలో.. అధికారులు గత్యంతరం లేని పరిస్థితుల్లో గురువారం రైతు పొలంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసి, ఎర్రజెండాలు పాతారు.



మంత్రి చేతులు మీదుగా అవార్డు అందుకుంటున్న బాలు

## మంత్రి చేతుల మీదుగా రక్తదాతకు అవార్డు

కామారెడ్డి రూరల్, జూన్ 14: ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా రక్తదాత అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని సంస్కృతి ఆడిటోరియంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్తమ రక్తదాతల అవార్డుల కార్యక్రమంలో 73 సార్లు రక్తదానం చేయడంతోపాటు,తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరాలను అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి సకాలంలో రక్తాన్ని అందజేస్తున్నందుగాను ఉత్తమ రక్తదాత అవార్డును అందుకున్నారు.

## బాన్సువాడలో రాక్తదాన శిబిరం

బాన్సువాడటౌన్, జూన్ 14: రక్తదానం చేద్దాం.. ప్రాణదాతలుగా నిలుద్దామంటూ సోషల్ వర్కర్ సునీల్ రాథోడ్ యువతకు పిలుపునిచ్చారు. శుక్రవారం రక్తదాత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని బ్లడ్ బ్యాంక్‌లో 20వ సారి రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొదటగా 2015లో సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా రక్తదానం చేశానని, ఈ తర్వాత ప్రతీ మూడు నెలలకు ఒక్కసారి రక్తదానం చేయటం అలవాటుగా మార్చుకున్నానన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారికి కాపాడుకోవచ్చని, బ్లడ్ బ్యాంక్‌లో రక్తం కొరత ఉండదన్నారు. బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సునీల్‌రాథోడ్‌ను ఘనంగా సన్మానించారు.



**సదాశివనగర్:** ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానం చేస్తుందని ఇన్స్‌పైర్ సొసైటీ రూరల్ డెవలప్‌మెంట్ ప్రతినిధి అవ్వుత రాజేందర్‌రావు అన్నారు. శుక్రవారం లింగంపల్లి గ్రామంలో మెగారక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 45 యూనిట్ల రక్తం సేకరించారు.ఈ కార్యక్రమంలో ఐఎస్‌ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రవళి, ప్రతినిధులు శివాజీరావు, విఠల్‌రావు, సంతోష్, సౌమ్య, ప్రమోద్‌కుమార్, అరుణ్‌కుమార్, సాయికుమార్ పాల్గొన్నారు.

# ఎరువులు, విత్తనాల దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్సు అధికారులు

నాగిరెడ్డిపేట, జూన్ 14: మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాల షాప్‌లను శుక్రవారం జిల్లా టాస్క్‌ఫోర్సు అధికారుల బృందం తనిఖీలు చేశారు. దుకాణాల్లోని స్టాక్ రిజిష్టర్లను, ప్రిన్సిపల్ సర్టిఫికెట్లను, బిల్ బుక్‌లను తనిఖీ చేశారు. విత్తనాల స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా నాణ్యమైన విత్తనాలు మాత్రమే రైతులకు విక్రయించాలని, విత్తనాలు కొనుగోలు చేసే ప్రతీ రైతుకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని టాస్క్‌ఫోర్సు అధికారులు డీలర్లను ఆదేశించారు. నకిలీ విత్తనాలు రైతులకు విక్రయించినా, విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు బిల్లులు ఇవ్వకున్నా అట్టి దుకాణం డీలర్‌పైన చట్టరీత్యా చర్యలు చేపడతామన్నారు. ఈ తనిఖీల్లో కామారెడ్డి టాస్క్‌ఫోర్సు అధికారులు, కామారెడ్డి ఏడీఏ అపర్ణ, కామారెడ్డి ఏవో శ్రీనివాస్, దోమకొండ ఏవో పవన్‌కుమార్‌తో పాటు మండల వ్యవసాయ అధికారి విజయశేఖర్, ఎస్ఐ రాజు తదితరులు ఉన్నారు.



# సినిమా గైడ్ కామారెడ్డి

**కామారెడ్డి**

శాంతి - ఓసీ
దర్శన్ - మహారాజ
ప్రియా 70 - మనమే
ప్రియా 35 - హరోంహర

**బాన్సువాడ**

మహేశ్వరి - మనమే
వెంకటేశ్వర - గం గం గణేశా

# చికెన్ ధరలు

| రకం | | లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|---|
| సుగుణ (కిలో) | : | 160 | 200 | 220 |
| వెన్‌కాబ్(కిలో) | : | 170 | 220 | 230 |